నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
15 | హైదరాబాద్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

విద్యార్థినుల ఆత్మహత్యలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

భువనగిరి అర్బన్ : విద్యార్థినుల ఆత్మహత్యలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. భువనగిరి ఏరియా దవాఖాన ఎదుట ఆదివారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇద్దరు మైనర్ విద్యార్థినులు చనిపోవడం బాధాకరమన్నారు. విద్యార్థినుల మృతులకు కారణమైన అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని, ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. లేకపోతే మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. పెద్ద సంఘటన జరిగితే దానిని నీరు గార్చే కుట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని, నిజానిజాలు బయటకు రాకుండా దోషులను కాపాడే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూరజ్, సైదులు, సుభాష్, అమర్, పెంట నితీశ్, పండు, శ్రీశైలం, ఫజల్, అమీర్ అలీ కాజమ్, సిద్దుల పద్మ పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై అనుమానాలెన్నో..?

- అంతుబట్టని పదో తరగతి విద్యార్థుల ఘటన
- స్కూల్‌లో బాలికలతో గొడవే కారణమా..?
- వార్డెన్, వాచ్‌మన్, ఆటో డ్రైవర్‌పై పేరెంట్స్ అభియోగాలు
- సూసైడ్ నోట్‌పైనా పలు సందేహాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న దర్యాప్తు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన పదో తరగతి విద్యార్థినుల ఘటనపై ఎన్నో అనుమానాలు తావిస్తున్నాయి. అసలు ఆత్మహత్యా..? హత్యా..? అనేది క్లారిటీ రావడం లేదు. బాలికలది ఆత్మహత్య అని అధికారులు, పోలీసులు చెబుతుండగా, కచ్చితంగా హత్యే అని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. ఇందుకు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థినుల కుటుంబ సభ్యులు

పిల్లల మధ్య గొడవే కారణమా..?

విద్యార్థినుల సూసైడ్‌కు విద్యార్థుల మధ్య గొడవే కారణమని వార్డెన్ శైలజ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఏడో తరగతి, పదో తరగతికి చెందిన కొందరు విద్యార్థుల మధ్య గొడవ జరిగినట్లు పేర్కొన్నారు. ఘర్షణ నేపథ్యంలో టీచర్.. వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా, ఆమె సదరు విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే చిన్నపాటి గొడవకే ఆత్మహత్య చేసుకునేందుకు పిరికోళ్లు తమ పిల్లలు కాదని తల్లిదండ్రులు అంటున్నారు. తమ కూతురు అన్ని విషయాల్లో ధైర్యం ఉంటుందని, సూసైడ్ చేసుకోవడం ఏంటని భవ్య తల్లి చెప్పుకొచ్చింది. కాగా అసలు గొడవ ఎందుకు జరిగిందనే ఇప్పటికీ క్లారిటీ రాలేదు.

ఆటో డ్రైవర్‌పై అభియోగాలు..!

ఈ ఘటనలో మరో కొత్త కోణంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్టల్ పనిచేస్తున్న ఓ ఉద్యోగి, ఆటో డ్రైవర్ మధ్య కొంత కాలంగా అక్రమ సంబంధం ఉందనే ప్రచారం జరుగుతున్నది. సదరు ఆటో డ్రైవర్ పగలు, రాత్రి అనే తేడా లేకుండా హాస్టల్‌లో తిరిగేవారని చెబుతున్నారు. స్థానికులు సైతం అతడిపై చెడుగా చెబుతుండటం గమనార్హం. ఈ కోణంలోనూ విద్యార్థినులను ఏమైనా చేసి ఉండవచ్చా అనే విషయంలోనూ స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. తల్లిదండ్రులు సైతం వార్డెన్, సదరు ఉద్యోగి, ఆటో డ్రైవర్‌పైనే అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల ఆటో డ్రైవర్ విషయంలో గొడవ జరిగితే భవ్య తమకు ఫోన్ చేసి చెప్పిందని, ఇక్కడ ఉండలేనని తీసుకెళ్లాలని కోరిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండు నెలల్లో పరీక్షలు ఉన్నాయని, పూర్తికాగానే తీసుకెళ్తామని బదులిచ్చామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్, సదరు ఉద్యోగి పరారీలో ఉన్నారు.

సూసైడ్ నోట్ నిజమేనా..?

విద్యార్థుల ఆత్మహత్య తర్వాత శనివారం రాత్రి ఓ సూసైడ్ నోట్ బయటకు వచ్చింది. ఇద్దరు విద్యార్థుల్లో ఇది ఎవరు రాశారనే క్లారిటీ రావాల్సి ఉంది. నోట్‌లో పూర్తిగా వార్డెన్ శైలజకు అనుకూలంగానే ఉందనే ప్రచారం జరుగుతున్నది. తల్లిదండ్రుల గురించి ఎక్కడా ప్రస్తావించ లేదు. అయితే భవ్య, వైష్ణవి సంతకాలు ఒకే విధంగా ఉన్నాయి. మరోవైపు హ్యాండ్ రైటింగ్ తమ పిల్లలది కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సూసైడ్ నోట్‌పై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తే అసలు విషయం ఏంటనేది బయటకు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినుల మృత దేహాలను పోస్ట్ మార్టం రూమ్‌లో భద్రపరించారు. పోస్ట్ మార్టం కంటే ముందు స్టూడెంట్లను చూసేందుకు పలువురు కుటుంబ సభ్యులను అనుమతించారు. బయటకు వచ్చిన వారు పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేతిపై గాయాలు ఉన్నాయని, మెడపై చుట్టు గాట్లు ఉండకుండా ఒక వైపే ఉన్నాయని చెప్పుకొచ్చారు. నాలుక బయటకు రాలేదని అంటున్నారు.

ముమ్మరంగా దర్యాప్తు..

విద్యార్థుల ఘటనపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయమే సూసైడ్ స్పాట్ అయిన సాయికృప డిగ్రీ కాలేజీలోని ఎస్సీ హాస్టల్‌లో విచారణ ప్రారంభించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాలతో కలిసి ఘటనా స్థలిని పరిశీలించారు. అక్కడే పలు వివరాలను సేకరించారు. అనంతరం క్లూస్ టీం హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరించింది.

రోదిస్తున్న విద్యార్థినుల కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థినులు

టెన్త్ విద్యార్థినుల సూసైడ్‌పై అట్టుడికిన భువనగిరి

- ఉదయం నుంచే పేరెంట్స్, కుటుంబ సభ్యుల ధర్నా
- మొదట ఎస్సీ హాస్టల్ ఎదుట ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాలు, బీఆర్ఎస్
- తోపులాట.. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- ఘర్షణలో పలువురు మహిళలకు గాయాలు
- బీఆర్ఎస్ నేతల అరెస్ట్.. పోలీస్ స్టేషన్లకు తరలింపు
- వాహనాల అడ్డగింత.. భారీగా ట్రాఫిక్ జామ్
- పోస్ట్‌మార్టం పూర్తి.. స్వస్థలాలకు మృతదేహాల తరలింపు
- కలచివేసిన కుటుంబీల రోదనలు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ఆర్తనాదాలు.. ఆగ్రహాలు.. ఆందోళనలు.. తోపులాటలు.. ఉద్రిక్త పరిస్థితులతో భువనగిరి అట్టుడికింది. పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్యలతో పట్టణం ఆగ్రహించింది. బాలికల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, విద్యార్థి, మహిళా, ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ నేతల ఆందోళనలతో దద్దరిల్లింది. బాలికల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

ఉదయం ఎస్సీ హాస్టల్ ఎదుట ఆందోళనలు..

ఆత్మహత్యల ఘటన నేపథ్యంలో ఉదయం నుంచే ఆందోళనలు షురూ అయ్యాయి. పట్టణంలోని సాయికృప డిగ్రీ కాలేజీలో నడుస్తున్న ఎస్సీ హాస్టల్ ఎదుట భవ్య, వైష్ణవి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. గేటు ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. తమ పిల్లలకు ఆత్మహత్య కాదని, హత్య అని, బాధ్యులైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 12గంటల వరకు అక్కడే ఆందోళన చేపట్టారు. వీరికి విద్యార్థి, మహిళా, ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ నేతలు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి ముందు రోడ్డుపై బైఠాయింపు..

ఎస్సీ హాస్టల్ ఎదుట ఆందోళన చేసినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంతో అందరూ భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలివచ్చారు. అక్కడే ప్రధాన రహదారిపై అందరూ బైఠాయించారు. రెండు వైపులా వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాసీల్దార్ వెంకట్‌రెడ్డి, పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఒకానొక సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. చేసేదేం లేక పోలీసులు ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. దీంతో హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై ఆందోళనకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యార్థినుల కుటుంబ సభ్యులకు గాయలయ్యాయి. తమను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి రక్తాలొచ్చేలా కొట్టారని వారు ఆరోపించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్ సందర్శించి.. కుటుంబ సభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాలకు పోస్ట్ మార్టం అంబులెన్స్‌లలో వారి స్వస్థలాలకు తరలించారు.

బీఆర్ఎస్ నేతల అరెస్ట్.. పోలీస్ స్టేషన్లకు తరలింపు

ఆందోళన చేస్తున్న సమయంలోనే పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. విద్యార్థినుల కుటుంబసభ్యులతోపాటు బీఆర్ఎస్‌కు చెందిన పట్టణ శాఖ నాయకులు, ప్రజా సంఘాలనేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. ఈ క్రమంలో పోలీస్ట్ స్టేషన్‌లో తమను రక్తాలు వచ్చేలా కొట్టారని విద్యార్థినులు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

భారీగా మోహరించిన పోలీసులు..

ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి ఘటనకు తావివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అటు ఎస్సీ హాస్టల్ వద్ద, ఇటు ఏరియా ఆస్పత్రి వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతో పాటు ఇతర ప్రాంతాలను నుంచి పెద్ద ఎత్తున రప్పించారు. స్పెషల్ బెటాలియన్ పోలీసులను ఉపయోగించుకున్నారు. ఎస్సీ హాస్టల్‌లో విచారణ సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు.

దుఃఖసాగరంలో కుటుంబ సభ్యులు

ఇద్దరు విద్యార్థినుల విషాద ఘటనతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో నిండిపోయారు. ఎస్సీ హాస్టల్ వద్ద, ఏరియా ఆస్పత్రి ముందు వారి రోదనలు మిన్నంటాయి. చిన్నా పెద్దా గుండెలవిసేలా ఏడ్చారు. గుండెలు బాదుకుంటూ తమ పిల్లలను పదేపదే తలచుకుంటూ బోరుమన్నారు. ఈ ఘటన అక్కడున్న వారిని కలచివేసింది. స్థానికులు సైతం కంటతడి పెట్టుకున్నారు. విద్యార్థినుల శ్రద్ధాంజలి ఫ్లెక్సీని చూసి భవ్య తల్లి పడిన బాధ వర్ణాతీతం. భవ్యను చూస్తూ ఏడ్చిఏడ్చిసొమ్మసిల్లి పడిపోయింది. మరోవైపు వైష్ణవి తల్లి లేదు. చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి దివ్యాంగుడు. తన తమ్ముడు సైతం ఆరేండ్ల క్రితమే చనిపోయాడు. ఒక్కగానొక్క కూతురు కూడా చనిపోవడంతో ఆ తండ్రికి కండ్లలో ఏడ్వడానికి నీళ్లు కూడా రావడంలేదు.

హాస్టల్ ఖాళీ..

విద్యార్థినుల ఘటనతో సాయికృప డిగ్రీ కాలేజీలో ఉంటున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఒక్కొక్కరుగా ఇంటికి వెళ్లిపోయారు. తోటి విద్యార్థులు చనిపోవడంతో వారంతా భయాందోళనకు గురయ్యాయి. అక్కడ ఉండాలంటే జంకుతున్నారు. విద్యార్థులంతా తమ సామాన్లను తీసుకొని పయనమయ్యారు. దీంతో హాస్టల్ ఖాళీ అయ్యింది.

ఆటో డ్రైవర్ ఆంజనేయులే కారణం

'వారం రోజుల క్రితం భవ్య ఇంటికి వచ్చింది. అమ్మ నాకు హాస్టల్ పోబుద్ధి అయితలేదంది. చిట్టి నువ్వు స్కూల్ టాపర్ కావాలి బిడ్డా.. నిన్ను అందరూ గొప్పగా చూడాలని హాస్టల్ పంపుతున్నమని చెప్పిన.. ఆటో డ్రైవర్ రాత్రి 12:30కి వచ్చి పోయేటప్పుడు మెట్ల మీద ఉన్న పిల్లలను చూసుకుంటా పోతాడని చెప్పింది. అమ్మాయిలను మీద కూర్చోబెట్టుకుంటాడని అన్నది. నేను మేడానికి రెండు సార్లు కంప్లైంట్ చేశానని, నీకెందుకు అని వార్డన్ అన్నదని చెప్పింది. నా బిడ్డ చావుకు కారణం ఆటో డ్రైవర్ ఆంజనేయులు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కోడి లలిత, విద్యార్థిని భవ్య తల్లి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

భువనగిరి అర్బన్ : భువనగిరి ఎస్సీ వసతి గృహంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలోని మార్చురీలో భద్రపరిచిన విద్యార్థుల మృతదేహాలను చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్త పరిచారు. ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి చర్యలు పునావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అనంతరం మృతుల ఒక్కొక్క విద్యార్థి కుటుంబానికి రూ.50వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యార్థుల మృతదేహాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

విద్యార్థినుల ఆత్మహత్య బాధాకరం

- బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల

భువనగిరి అర్బన్ : ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని, ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొని వెంటనే శిక్షించాలని షీప్ ఆండ్ గోట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం జరిగేలా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇద్దరి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు. దళిత సంఘాలు, బీసీ సంఘాలు, ధర్నా చేస్తుంటే జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

హాస్టళ్ల నిర్వహణ గాలికి

గాడి తప్పిన సంక్షేమ వసతి గృహాలు

అందుబాటులో ఉండని వార్డెన్లు.. పట్టించుకోని అధికారులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 4 : నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. అన్ని వసతులను కల్పించి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నది. కానీ సంక్షేమ హాస్టల్‌లో విధులు నిర్వర్తించే వార్డెన్లు నిర్లక్ష్యంగా ఉండడం మూలంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అందించే వాటిని వార్డెన్‌లు స్వలాభాలకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులను తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వార్డెన్లు హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేసి కిందిస్థాయికి అప్పగిస్తున్నట్లు తెలుస్తున్నది. దాంతో విద్యార్థులు ఏమి చేస్తున్నారో, ఎవరు ఎక్కడికి వెళ్తున్నారో, ఎవరితో మాట్లాడుతున్నారో అనే విషయాలు గమనించే పరిస్థితి లేదు. ఈ క్రమంలో జిల్లాలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలుపుతున్నాయి.

భువనగిరిలోని బాలుర వసతి గృహం

మౌలిక వసతుల లేమి

సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అందడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు సంబంధించి 45 సంక్షేమ హాస్టళ్లు ఉండగా అందులో 3,628 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందకుండా ఆయా వార్డెన్లు చేతి వాటం ప్రదర్శిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా పలు హాస్టళ్లలో నిర్వహణ లోపాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. దాంతో విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారుతున్నది.

ఫిర్యాదులకు జంకుతున్న విద్యార్థులు

సంక్షేమ హాస్టళ్లలో ఉండే వార్డెన్‌లది ఇష్టారాజ్యంగా కొనసాగుతుండటంతో అందులోని విద్యార్థులు సంబంధిత వార్డెన్‌లపై పై అధికారుల కు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ప్రతి హాస్టల్‌లో చేపడుతున్న కార్యక్రమాలు, వాటి నిర్వహణ, పోషకాహార పంపిణీ తదితర అంశాలపై ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షణలు సైతం నామమాత్రంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉన్నది.

రామన్నపేట : పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కూరెళ్లను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

కూరెళ్లకు రాష్ట్ర ప్రభుత్వ సత్కారం

రామన్నపేట, ఫిబ్రవరి4 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, మధుర కవి కూరెళ్ల విఠలాచార్య పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో ఘనంగా సత్కరించింది. తెలంగాణ భాష, సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

- వైభవంగా లక్ష్మీ నృసింహుడికి నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి4 : పంచనారసింహ స్వామి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. ఆదివారం సెలవుదినం కావడంతో యాదగిరిగుట్ట స్వయంభూ నారసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయ శాల సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుదీరారు. నిత్య తిరుకల్యాణోత్సవం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా గజవాహన సేవ

స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవను నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి, దర్బార్ సేవోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారిని సుమారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. 45,01,535 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

భక్తులకు అపురూప గ్రంథం 'శ్రీలహరి'



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి4 : ఉదయం నుంచి రాత్రి వరకూ యాదగిరిగుట్ట క్షేత్రానికి పొటెత్తిన భక్తులకు దేవస్థాన అధికారులు అందించిన 'శ్రీలహరి' అపురూప గ్రంథం విశేషంగా ఆకట్టుకున్నది. ఆదివారం బ్రేక్ దర్శనం, అభిషేక దర్శనం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, వీఐపీ దర్శనాలలో పాల్గొన్న భక్తులకు అపూర్వగ్రంథాన్ని దేవస్థాన సిబ్బంది అందించడంతో పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలోనే పారాయణం చేసుకోవడం కనిపించింది. శని, ఆదివారాల్లో పాల్గొన్న పలువురు న్యాయమూర్తులు, రాజకీయ ప్రముఖులు శ్రీలహరి గ్రంథాన్ని, ఆలయ అధికారులను, ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌ను బహుముఖంగా ప్రశంసించడం విశేషం. ఆదిశంకరాచార్యులు ఈ జాతికి అందించిన ఉత్తమశ్రేణికి చెందిన 'శ్రీలక్ష్మీనృసిం కరావలంబ స్తోత్రమ్' తోపాటు ఐశ్వర్యాలను వర్షించే కనకధారా స్తోత్రమ్, శ్రీలక్ష్మీ అష్టోత్తరశతనామ స్తోత్రమ్, ఆత్మబలాన్నిచ్చే శ్రీరామ రక్షాస్తోత్రమ్, శ్రీవేంకటేశ్వర ప్రపత్తి, శ్రీవేంకటేశ్వర మంగళాశాసనం వంటి ఎన్నో స్తోత్ర వైభవాలతో ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు పురణాపండ శ్రీనివాస్ రమణీయ, కమనీయ వ్యాఖ్యాలతో రూపుదిద్దుకున్న శ్రీలహరి అపూర్వ గ్రంథాం పూర్తిగా నాణ్యమైన ప్రమాణాల ముద్రించడం విశేషంగా భక్తులను ఆకర్షిస్తున్నదని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్

విద్యతోనే సమాజంలో గౌరవం

- సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 4 : శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు ప్రవర్తనలతో సామాన్యుడు సైతం శక్తిమంతంగా మారవచ్చని, విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కస్తూర్బా విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ వహీదాసుల్తానా అధ్యక్షతన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమంలో భాగంగామాట్లాడారు. శాస్త్రీయ ప్రణాళిక –పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చని, విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదుగవచ్చునని, విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగ పరుచుకోవాలని చెప్పారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధన కోసం మరిన్ని వివరాలకు 9989310141 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘం యూనియన్ నాయకులు కట్టా శేఖర్, ఉపాధ్యాయ బృందం సువర్ణ, రజిత పాల్గొన్నారు.

సజావుగా సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష

పరీక్ష సరళిని పరిశీలిస్తున్న గురుకుల కళాశాలల జాయింట్ సెక్రెటరీ నిరుపమ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : టీఎస్‌డబ్ల్యూ సెట్ పరీక్ష జిల్లాలో ఆదివారం సజావుగా జరిగింది. ఈ పరీక్ష నిర్వహణకు జిల్లాలో 6 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. జిల్లాలో 4,774 మంది విద్యార్థులకు 4,591 మంది హాజరయ్యారు. 183 మంది గైర్హాజరయ్యారు. భువనగిరి పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరిగిన పరీక్ష సరళిని గురుకుల కళాశాలల జాయింట్ సెక్రటరీ నిరుపమా పరిశీలించారు.